సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 29 । జూలై । 2024



వరదలో జలదీక్ష

తమ గ్రామాలను పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని గన్నవరం, కృష్ణవరం పంచాయతీల ప్రజలు ఆదివారం గ్రామాన్ని చుట్టుముట్టిన వరదనీటిలో జలదీక్ష నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

ఘాట్‌రోడ్లలో రాత్రివేళ వాహన రాకపోకలు నిషేధం

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఘాట్‌రోడ్లలో ఆదివారం రాత్రి నుంచి భారీ వాహనాలు, బస్సులు,ప్రైవేట్ జీపులు, కార్లు రాకపోకలను నిషేధిస్తున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వర్షాలు తగ్గేంతవరకు ఘాట్ రోడ్లలో సాయంత్రం 7గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6గంటల వరకు వాహనాలను నడపరాదన్నారు. ఘాట్ రోడ్లలో కొండచరియలు, చెట్లు విరిగిపడే అవకాశం ఉన్నందున మరికొన్ని రోజుల పాటు వాహనాల రవాణాపై నిషేధం ఉంటుందన్నారు. తదుపరి ఉత్తర్వుల వెలువడే వరకు వడ్డాది–పాడేరు ఘాట్‌రోడ్డు, పాడేరు–చింతపల్లి, రంపచోడవరం నుంచి చింతూరు, ఎస్.కోట–అరకు, డౌనురు–లంబసింగి ఘాట్ రోడ్లలో రాత్రి సమయంలో వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు. నిషేధ ఉత్తర్వులను పూర్తిస్థాయిలో అమలుజేయాలని అధికారులను ఆదేశించారు.

గడిబాపనమ్మకు బోనాల సమర్పణ



సీతపల్లి బాపనమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

రంపచోడవరం: సీతపల్లి గడిబాపనమ్మ అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం బోనాల మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మంగళవాయిద్యాల మధ్య భక్తుల నృత్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీతపల్లి గ్రామ పెద్ద మడకం కుమారస్వామి, చంద్రశేఖర్, బత్తిన శ్రీను, నల్లమిల్లి వెంకట రామిరెడ్డి, ఈఓ గండేపూడి సత్యరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం (విశాఖ) : భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా కేకే లైన్ ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు రోజు ఉదయం విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 29 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు రోజు కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు రోజు రాత్రి విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్(18514) ఎక్స్ ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 29 నుంచి ఆగస్టు ఒకటి వరకు రోజు కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్- విశాఖ(18513) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

ఘాట్ రోడ్డులో కూలిన భారీ వృక్షం

- ఐదు గంటల పాటు నిలిచిన రాకపోలు



చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

సీలేరు: అంతర్ రాష్ట్ర రహదారి ధారాలమ్మ తల్లి ఘాట్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున భారీ వృక్షం కూలింది. దీంతో ఉదయం 11 గంటల వరకు సీలేరు నుంచి నర్సీపట్నం వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ధారాలమ్మ ఆలయ దిగువ ప్రాంతంలోని నాల్గువ మలుపు వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. దీంతో స్థానికులు ఆర్అండ్‌బీ అధికారులకు సమాచారమివ్వడంతో వెంటనే వారు స్పందించారు. చెట్టు తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో వాహన రాకపోకలు ప్రారంభమయ్యాయి.



వీఆర్‌పురం : గుట్టపై వేసుకున్న గుడారాల వద్ద ములకపల్లి వరద బాధితులు



కూనవరం ప్రాంతంలో వంతెన పైనుంచి ప్రవహిస్తున్న శబరి నది వరదనీరు



ఎటపాక: గన్నవరం వద్ద రహదారిని ముంచెత్తిన వరద నీటిలోంచి రాకపోకలు

శాంతించిన గోదావరి..

వణికిస్తున్న శబరి

- చింతూరును ముంచెత్తిన వరద
- ముంపులో గ్రామాలు
- నిలిచిపోయిన రాకపోకలు
- భద్రాచలం వద్ద తగ్గిన నీటిమట్టం
- రెండవ ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరి నీటిమట్టం క్రమేపీ తగ్గుతోంది. డొంకరాయి, సీలేరు నదుల వరద నీటి కారణంగా ఉప్పొంగిన శబరి చింతూరు మండలంలోని పలు గ్రామాలను ముంచెత్తింది. పరిస్థితిని గమనించిన స్థానికులు వెంటనే ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. శనివారం సాయంత్రం నుంచి కాస్త తగ్గుముఖం పట్టడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

చింతూరు: గోదావరి శాంతించినా శబరి ఉధృతి కొనసాగుతోంది. భద్రాచలం శనివారం రాత్రి 53.6 అడుగులు ఉన్న నీటిమట్టం ఆదివారం రాత్రి 9 గంటలకు 47.8 అడుగులకు చేరడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరి ఉధృతి తగ్గుతుండగా డొంకరాయి జలాశయం నుంచి విడుదల అవుతున్న వరదనీరు సీలేరు నది ప్రవహానికి తోడవడంతో శబరి ఉప్పొంగింది. దీంతో వరదనీరు చింతూరుతో పాటు పలు గ్రామాలను ముంచెత్తింది. ఇళ్లల్లోకి ప్రవేశిస్తుండడంతో బాధితులు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. ఈ నేపథ్యంలో చింతూరు వంతెన వద్ద 46 అడుగులకు చేరిన శబరి నది ఆదివారం సాయంత్రానికి క్రమేపీ తగ్గుముఖం పట్టింది.

- చింతూరులోని టోల్‌గేట్ సెంటర్, శబరిఒడ్డు, వీఆర్‌పురం రహదారి, గ్రామ పంచాయతీ రోడ్డు, బీసీకాలనీ ప్రాంతాల్లోని ఇళ్లు ముంపునకు గురయ్యాయి. దీంతోపాటు ఏజీకొడేరు, మల్లెతోట, ఉలుమూరు, కుమ్మూరు, చట్టి, లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి కూడా వరదనీరు చేరింది. దీంతో 5,210 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు.
- శబరినది ఉధృతికి చింతూరు నుంచి చట్టికి, వీరాపురం వద్ద వరదనీరు జాతీయ రహదారిపై చేరడంతో మళ్లీ ఆంధ్రా నుంచి ఛత్తీస్‌గఢ్‌కు కూడా రాకపోకలు నిలిచిపోయాయి.



వీఆర్‌పురం: శబరి నది ఉధృతికి మునిగిన ములకపల్లి గ్రామం

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు:

వరద కారణంగా వ్యాపారులు నిత్యావసరాలు, కూరగాయలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య హెచ్చరించారు. ఆదివారం చింతూరులో వరద ప్రవాహాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. ప్రజలు ప్రమాదకరంగా వరదనీటిని దాటకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు.

వీఆర్‌పురం: గోదావరి ఉధృతి తగ్గుతున్నప్పటికీ మండలాన్ని ఆనుకుని ఉన్న శబరి నది మాత్రం ఉధృతంగానే ఉంది. భద్రాచలం వద్ద నమోదైన గోదావరి నీటిమట్టానికి మించి 55.5 అడుగులకు చేరుకుంది. అయితే సాయంత్రం 3 గంటల నుంచి కాస్త తగ్గుముఖం పట్టడంతో ముంపు ప్రాంతాల ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

- గత నాలుగు రోజుల నుంచి వరద నీరు నిలిచి ఉండటంతో కూనవరం- వీఆర్‌పురం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా మండలంలోని 40 గ్రామాలకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. మండలాన్ని ఆనుకొని ఉన్న ప్రవహిస్తున్న శబరి నది బ్రిడ్జి పైనుంచి వరదనీరు ప్రవహించింది. దీని ప్రభావం రాకపోకలపై చూపింది.

బాధితులకు అన్నివిధాలా సాయం

- ఒకొక్క కుటుంబానికి రూ.3వేల సాయం
- ఆర్అండ్‌ఆర్‌పై ప్రభుత్వానికి నివేదిక
- కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడి



చింతూరు: వీరాపురంలో వరద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు: వరద బాధితులకు అన్నివిధాలా సాయమందిస్తామని, ఐటీడీఏలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం ద్వారా వరదల్లో ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వరదలు పూర్తిగా తగ్గిన అనంతరం బాధితుల ఇళ్లకు వెళ్లేటప్పుడు ప్రభుత్వం ప్రకటించిన రూ.మూడు వేల సాయం అందిస్తామని తెలిపారు.

- వరదల కారణంగా చింతూరు డివిజన్లోని నాలుగు మండలాల్లో 191 గ్రామాలు ప్రభావితమయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని 35,746 కుటుంబాలను 149 పునరావాస కేంద్రాలకు తరలించి రేషన్, నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశామని తెలిపారు. రేషన్‌కార్డులు లేని కుటుంబాలకు సాయం అందించామని తెలిపారు. వరద రహదారులను చుట్టుముట్టిన ప్రతి గ్రామానికి చెందిన ప్రజలను కూడా వరద బాధితులగానే పరిగణించి సాయం అందజేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.
- వరద తగ్గిన తరువాత నష్టంపై అంచనాలు తయారుచేసి ప్రభుత్వం నుంచి పరిహారం అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఏటా వరదల వల్ల ఇబ్బందులు పడలేక పోతున్నామని, తమకు పోలవరం పరిహారం ఇచ్చి పునరావాసం కల్పించాలని ప్రతి గ్రామంలో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళవందనం, ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో పర్యటన

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం చింతూరు మండలంలోని వీరాపురం, చట్టి, కూనవరం మండలంలోని బొజ్జిరాయిగూడెం, తాళ్లగూడెంలోని వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్య ఉంటే ఐటీడీఏలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంకు తెలియజేయాలని, వరదలు తగ్గిన తరువాత గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవోలు సూరజ్ ధనుంజయ్ గనోరే, కావూరి చైతన్య, తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపీడీవో లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

ఎటపాక: గోదావరి వరద ముంపు బాధితులకు ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన నందిగామలోని పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. బాధితులతో మాట్లాడారు. వారికి నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. తహసీల్దార్ శేఖర్,ఎంపీడీవో మురళీకృష్ణ తదితరులున్నారు.



పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వరద బాధితులు



చింతూరు, భద్రాచలం రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు



ట్రాక్టర్‌పై సామాన్లను తీసుకెళ్తున్న బాధిత కుటుంబాలు



చింతూరు, వీఆర్‌పురం రహదారిలో నీటమునిగిన దుకాణాలు

శాకంబరిగా మోదమ్మ

- ఘనంగా అలంకరణ మహోత్సవం
- భారీగా అన్నసమారాధన



శాకంబరి అలంకరణలో మోదకొండమ్మతల్లి

సాక్షి,పాడేరు: తెలుగు రాష్ట్రాల్లో మహిమాన్విత దేవతగా పేరొందిన పాడేరులోని మోదకొండమ్మతల్లికి శాకంబరి అలంకరణ మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లతో అమ్మవారి విగ్రహాన్ని అలంకరించారు. ఉదయం ఐదు గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌తోపాటు కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు, ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు,రమాదేవి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను ఆలయ కమిటీ సత్కరించింది. భక్తులు భారీగా తరలివచ్చారు. ఇంటి పండగలతో జిల్లా కేంద్రమైన పాడేరులో సందడి నెలకొంది. అలాగే అన్ని వర్గాల భక్తుల సహకారంతో ఆలయ కమిటీ, మణికంఠ అన్నదాన ట్రస్టులు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ప్రారంభించి భక్తులకు భోజనాలు వడ్డించారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు సల్ల రామకృష్ణ, తమర్బ ప్రసాద్ నాయుడు, ముకుందరావు, ఉప్పల వెంకటరత్నం, సిద్దనాతి కొండలరావు, శివరాత్రి శ్రీనివాసరావు, భవాని మధు, డి.పి.రాంబాబు, రమణ,కోటపాడు శ్రీను, మాజీ సర్పంచ్‌లు మినుముల కన్నాపాత్రుడు, శరభ సూర్యనారాయణ పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న అరకు,పాడేరు ఎమ్మెల్యేలు మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి,డాక్టర్ నర్సింగరావు, కమిటీ ప్రతినిధులు

ఏవోబీలో అలర్ట్

- మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో ముమ్మరంగా తనిఖీలు
- మారుమూల గ్రామాలకు, రాత్రి బస్సు సర్వీసుల రద్దు





ముంచంగిపుట్టులో తనిఖీలకు వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు, ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో మోహరించిన పోలీసుల బలగాలు

ముంచంగిపుట్టు/సీలేరు/రాజవొమ్మంగి/కొయ్యూరు/వై.రామవరం: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాత్రి పూట గస్తీ నిర్వహిస్తున్నారు. ముంచంగిపుట్టులో ఆదివారం స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మారుమూల పంచాయతీల నుంచి వచ్చే వాహనదారులను ప్రశ్నించి, అనుమానితుల వివరాలు సేకరించారు.జోలాపుట్టు,దోడిపుట్టు నైట్‌హాల్ట్ బస్సులను మండల కేంద్రానికే పరిమితం చేశారు.

నిలిచిన ఆర్టీసీ బస్సు సర్వీసులు

అంతర్ రాష్ట్ర రహదారిలో రాత్రిపూట తిరిగే అన్ని ఆర్టీసీ బస్సులను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు నిలిపివేశారు. విశాఖపట్నం నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే రెండు బస్సులు, విశాఖపట్నం నుంచి సీలేరు వచ్చే నైట్ హాల్ట్ బస్సు, పాడేరు నుంచి డొంకరాయి వెళ్లే ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో సీలేరు పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

మారుమూల గ్రామాలకు వెళ్లొద్దు

మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మావోయిస్టు హిట్ లిస్టులో ఉన్న వారు మారుమూల గ్రామాలకు వెళ్లరాదని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు తెలిపారు. రాజవొమ్మంగి – కొయ్యూరు మండలాల సరిహద్దు బోయపాడు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు దళాలు ఆదివారం కూంబింగ్ నిర్వహించాయి. ప్రధాన కూడళ్ల వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ వెంకయ్య, రఘునాథరావు, సాయుధ పోలీసులు పాల్గొన్నారు.

- కొయ్యూరు మండలం బూదరాళ్లలో మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఆదివారం కొయ్యూరు సంత కావడంతో ఇక్కడకు వచ్చిన అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మావోయిస్టులకు ఎవరూ సహకరించరాదన్నారు. బూదరాళ్ల, రేవళ్లు, మంప బస్సులను పగటి పూట కూడా నిలిపివేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.గతంలో నైట్ హాల్ట్ బస్సులను మాత్రమే నిలిపివేసేవారని,ఇప్పుడు పగటివేళ సర్వీసులను కూడా నిలిపివేయడంతో ప్రయాణం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు పలు గ్రామాల ప్రజలు తెలిపారు.
- వై.రామవరం నుంచి అడ్డతీగల వెళ్లే ప్రధానరహదారిలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ ఎం. సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిపారు. స్టేషన్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

పాములరాయి గెడ్డలో యువకుడి గల్లంతు



ఉధృతంగా ప్రవహిస్తున్న పాములరాయి గెడ్డను దాటేందుకు యత్నించిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. 8లో

పెద్దపులి గాండ్రింపు

రూపంలో రాజసం.. నడకలో గాంభీర్యం.. వేగం.. ఇలా ఎన్నో లక్షణాలతో పులి మన జాతీయ జంతువైంది. ఒకప్పుడు వందల్లో కనిపించే పులుల సంఖ్య తర్వాత క్రమంగా తగ్గిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యలతో కొన్నేళ్లుగా ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. పెద్ద సంఖ్యలో పులుల సంతతి పెరుగుతుండడం ఆసక్తి రేకెత్తిస్తోంది. పులులు ఉన్న అడవుల్లో వృక్ష సంపద, పచ్చదనం, వివిధ రకాల వన్యప్రాణులతో వాతావరణం సమతుల్యంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం. ఇందిరాగాంధీ జూ పార్కులో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

- రాష్ట్రంలో పెరుగుతున్న పులుల సంతతి
- మన జూ పార్కులో ఏడు టైగర్లు
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం


జూలో ఎన్‌క్లోజర్లో తిరుగుతున్న ఎల్లో టైగర్స్

ఆరిలోవ (విశాఖ): అరణ్యంలో వన్యప్రాణులు సమపాళ్లలో ఉంటే మానవాళి మనుగడకు మేలు జరుగుతుంది. పర్యావరణంలో ఉన్న ఏ వన్యప్రాణి జాతి తగ్గినా సమతుల్యతకు భంగం కలుగుతుంది. మానవ చర్యలతో పులుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో పర్యావరణ శాస్త్రవేత్తల్లో ఆందోళన నెలకొంది. దీంతో పులుల సంతతి పెరగేందుకు, వాటి అవసరంపై ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి పర్యావరణవేత్తలు 1972లో దృష్టి సారించారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా పులుల వేటను నిషేధించారు. 2010 నుంచి ఏటా జూలై 29న అంతర్జాతీయ పులులు దినోత్సవం నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న పెద్ద పులుల సంఖ్య

భారతదేశంలో పెద్ద పులుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో వివిధ రాష్ట్రాల అడవుల్లో 3,682 పెద్ద పులులు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు లెక్కకట్టారు. 2006లో దేశంలోని వివిధ రాష్ట్రాల అడవుల్లో 1,411 పెద్ద పులులు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. 2010లో 1,726, 2014లో 2,226, 2018లో 2,969 కాగా 2023(2022లో లెక్కింపు జరగలేదు)లో వాటి సంఖ్య 3,682కి పెరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని అడవుల్లో పులులు ఎక్కువగా సంచరిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

రాష్ట్రంలో 75 పెద్ద పులులు

మన రాష్ట్రంలో 75 పులులు ఉన్నాయి. నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్‌లో 64, శేషాచలం అడవుల్లో 9, పాపికొండ లులో రెండు పులులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. శ్రీశైలం, ఆత్మకూరు, మర్కాపూర్‌లలో పులుల సంరక్షణ కేంద్రాలున్నాయి. 2014లో వీటి సంఖ్య 40 కాగా.. 2023 లెక్కల ప్రకారం వీటి సంఖ్య75కు పెరిగింది.

పులులను ఎలా లెక్కిస్తారంటే..

నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ) ఆధ్వర్యంలో ప్రతి నాలుగేళ్లకోసారి అటవీశాఖ అధికారులు పులుల సంఖ్యను లెక్కిస్తారు. అరణ్యాల్లో అవి నడిచే జాడ కనుక్కొంటారు. అధికార బృందాలు వాటి అడుగులను బట్టి లెక్కిస్తారు. అలాగే అడవుల్లో అవి సంచరించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తారు. వాటిలో నమోదైన వాటిని గుర్తిస్తారు.

ఏకాంతంగా పులుల సంచారం

అడవుల్లో పులులు ఒంటిరిగానే సంచరిస్తాయి. జింకలు, కనుజులు, ఏనుగులు మాదిరిగా గుంపులుగా తిరగవు. గుంపులుగా తిరిగే జింకల జాడ కనిపెట్టి ఓ చెట్టు చాటున, లేదంటే దట్టమైన పొదల చాటున మాటు వేస్తాయి. జింకలు దగ్గరకు రాగానే ఒక్కసారిగా వాటిపై దూకి ఒక దాన్ని పట్టుకుని ఆహారంగా తీసుకుంటాయి. ఇవి అడవుల్లో 12 నుంచి 16 ఏళ్లు జీవిస్తాయి. వీటిలో 3 నుంచి 4 ఏళ్ల వయసులో సంతానోత్పత్తి దశ ప్రారంభమవుతుంది. బ్రీడింగ్ సమయంలో మాత్రమే ఆడ, మగ పులులు కలసి తిరుగుతాయి. ఆడ పులి గర్భం దాల్చిన అనంతరం మగ పులి వేరే చోటకు వెళ్లిపోతుంది. అప్పటి నుంచి ఆడ పులి ఒంటరిగా ఉంటూ 110 రోజుల గర్భావధి అనంతరం కూనలకు జన్మనిస్తుంది. ఒక తడవలో ఒకటి నుంచి 5 వరకు కంటుంది. కూనలు జన్మించిన తర్వాత రెండేళ్లు తల్లి సంరక్షణలోనే ఉంటాయి. ఈ రెండేళ్లలో ఆ కూనలు ఆహారం సంపాదన నేర్చుకుంటాయి. అనంతరం తల్లే వాటిని తరిమేస్తుంది. అప్పటి నుంచి అవి వేర్వేరుగా జీవిస్తాయి.

దొరికినంత వరకు వెంబడిస్తాయి

పులులు జింక, కనుజు, అడవిదున్న, అడవి పంది, ముళ్లపంది తదితర వాటిని తింటాయి. అవి వాటి పంజాకు దొరికినంత వరకు వెంబడిస్తాయి. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో పరుగెత్తి వాటిని పట్టుకుంటాయి. పులి ఒక జంతువును చంపిన అనంతరం రెండు, మూడు రోజుల పాటు అదే ప్రాంతంలో తిరుగుతూ దాన్ని తింటుంది. తర్వాత వారం రోజుల వరకు ఆహారం లేకుండా ఉండగలదు. నీరు మాత్రం ఎక్కువగా తాగుతుంది. ఆహారం కోసం మగవి 20 నుంచి 25 కిమీ పరిధిలో, ఆడ పులులు 15 నుంచి 20 కిమీ పరిధిలో అడవుల్లో తిరుగుతుంటాయి. ఒక పులి తిరిగే పరిధిలో మరో పులి సంచరించదు. పులి తల నుంచి తోక వరకు సుమారు 10 అడుగుల పొడవు ఉంటుంది. దీని ఎత్తు 3 నుంచి మూడున్నర అడుగులు. ఆడ పులి 65 కిలోల నుంచి 170 కిలోలు, మగది 90 కిలోల నుంచి 310 కిలోల బరువు ఉంటుంది. ఆహారం కోసం వేటాడటం వల్ల వాటి ఆరోగ్యం క్రమేపీ క్షీణిస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఇందిరాగాంధీ జూపార్కులో 7 పెద్ద పులులు

ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో 7 పెద్ద పులులున్నాయి. వీటిలో నాలుగు తెల్ల పులులు(రెండు జతలు) కాగా మరో మూడు ఎల్లో టైగర్స్(ఒకటి మగ, రెండు ఆడవి). ఇవి ఆయా ఎన్‌క్లోజర్లలో సందర్శకులను అలరిస్తున్నాయి. ఇక్కడ జంతు సంరక్షకులు వీటికి సమయానికి ఆహారం, నీరు అందిస్తున్నారు. ఎన్‌క్లోజర్లలో వాటిని ఒక్కొక్కటిగా విడిచిపెడతారు. అన్నింటినీ ఒకేసారి విడిచిపెడితే పోట్లాడుకుని గాయాలు చేసుకుంటాయి.

పులులే అడవులకు రక్ష



పులులపై అందరూ అవగాహన కలిగి ఉండాలి. పులులు ఉన్న అడవుల్లో వృక్ష సంపద పుష్కలంగా ఉంటుంది. జింకలు, కనుజులు, అడవి పందు లు ఎక్కడైతే గుంపులుగా తిరుగుతున్నాయో.. ఆయా ప్రాంతాల్లో పులులు ఉన్నట్లు భావిస్తాం. ఇవి అడవుల్లో 15 ఏళ్ల వరకు, జూ పార్కులో అయితే 25 ఏళ్లకు పైగా జీవిస్తాయి. ప్రతీ పూట ఆహారం, వైద్యం అందిస్తున్నాం. అందుకు ఎక్కువ కాలం జీవించడానికి ఇక్కడ అవకాశం ఉంటుంది. ప్రతీ నాలుగేళ్లకు చేపడుతున్న లెక్క ల ప్రకారం పులులు సంఖ్య పెరుగుతోంది. పు లులపై అవగాహన కల్పించడానికి ఆదివారం పాఠశాల నుంచి పీజీ వరకు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించాం. సోమవారం జూలో పులులు దినోత్సవం నిర్వహిస్తాం.

– డాక్టర్ నందనీ సలారియా, జూ క్యూరేటర్

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

ఆరిలోవ (విశాఖ): అంతర్జాతీయ పులుల దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం జూ పార్కులో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నగరంలో పలు పాఠశాలలు, కళాశాలల నుంచి 110 మంది ఒకటో తరగతి నుంచి పీజీ విద్యార్థులు హాజరయ్యారు. తరగతులు వారీగా పులులు, వాటి సంరక్షణ, పర్యావరణంలో వాటి అవసరం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. వీటిలో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి సోమవారం బహుమతులు అందజేస్తామని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.


చిత్రాలు వేస్తున్న చిన్నారులు


ఆకర్షణీయంగా చిన్నారి వేసిన చిత్రం

క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- పాల్గొన్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రోలుగుంట : చోడవరం డిగ్రీ కళాశాలలో ఆదివారం 2003 నుంచి 2006 వరకూ చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. ఇక్కడ ఆటాపాటలతో రోజంతా గడిపారు. అప్పటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. వీరి ఆహ్వానం మేరకు పాడేరు ఎమ్మెల్యే మత్సరాస విశ్వేశ్వరారాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేను పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహించుకోవడం మన జీవితాల్లో తీపి గుర్తులుగా మిగిలిపోతాయన్నారు.

ప్రమాదవశాత్తు బోటుపై నుంచి పడి వ్యక్తి మృతి

వీఆర్ పురం: ప్రమాదవశాత్తూ బోటు పై నుంచి గోదావరి నదిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కోపాల జగపతిరెడ్డి (36) అనే వ్యక్తి వరదల సమయంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రదేశానికి బోటులో వెళ్తుండగా అదుపు తప్పి నదిలో పడిపోయాడు. కాగా అతడి మృతదేహం ఆదివారం లభ్యమైనట్టు గ్రామస్తులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


గాయపడిన సన్యాసినాయుడును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలో ఆదివారం సాయంకాలం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురు గాయపడ్డారు. మండలంలోని లబ్బర్తికి చెందిన లోకారపు సన్యాసినాయుడు అనే రైతు తన ఎడ్లబండిని తీసుకొని వెళ్తుండగా పట్టు తప్పి చక్రం కింద పడిపోయాడు. దీంతో అతని తొడభాగం నుజ్జు నుజ్జు కావడంతో కుటుంబీకులు హుటాహుటిన రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు అతని నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన పాతూరి శివరామకృష్ణ తన మోటారు బైక్‌పై మర్రిపాలెం వస్తుండగా వాహనం అదుపు తప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ప్రథమ చికిత్స అనంతరం ఏలేశ్వరం సీహెచ్‌సీకు రిఫర్ చేసినట్టు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ తెలిపారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

వీఆర్ పురం: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, మాజీ కన్వీనర్ పాడియం గోపాలరావు అన్నారు. జీడిగుప్ప గ్రామ పంచాయతీ పరిధిలోని వరద ముంపునకు గురైన మలకపల్లి గ్రామానికి ఆదివారం బోట్‌పై పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి వారు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శబరి, గోదావరి వరదలు వచ్చి సుమారు 10 రోజులు కావస్తున్నా మూలకపల్లి గ్రామంలోని ఇళ్లన్నీ వరద నీటిలో మునిగిపోయాయన్నారు. బాధితులు గుట్టపై గుడారాలు వేసుకొని ఉన్నారన్నారు. నాలుగు రోజుల క్రితం కలెక్టర్ దినేష్ కుమార్ ఈ గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు తప్ప వారికి అందచేయాల్సిన వరద సహాయాన్ని పూర్తి స్థాయిలో ఇవ్వలేదని వారు చెప్పారు. ప్రతి నెల ఇచ్చే రేషన్ బియ్యం ఇచ్చారు తప్ప నేటికీ వరద నిత్యావసర సరకులు, బియ్యం ఇవ్వలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గతేడాది రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ప్రతి వరద బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసరాలు ఐదు ఆరు రకాల కూరగాయలతో పాటు నూనె, పాలు, బిస్కెట్ తదితర సామగ్రి అందచేశారని గుర్తుచేశారు. అంతే కాకుండా మండలం మొత్తంగా ప్రతి కుటుంబానికి రూ.2 వేలు తక్షణ సహాయం అందించి వరద బాధితులను ఆదుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరద బాధితులను పూర్తి స్థాయిలో ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగులు , మండల వైస్ ప్రెసిడెంట్ చిక్కాల బాలు, సర్పంచ్ ముట్ల బాలరాజు, అరకు పార్లమెంట్ కార్యదర్శి బొడ్డు సత్యనారాయణ, నాయకులు ముత్యాల గౌతమ్, కాపారపు ఉమామహేశ్వవు, రేవు బాలరాజు, చీమల కాంతారావు, మామిడి బాలాజీ, మాచర్ల వెంగలరావు, మోడెం నరేష్ తదితరులు పాల్గొన్నారు.


వరద ముంపు గ్రామం ములకపల్లికి బోటులో వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వరదలో జలదీక్ష

పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని డిమాండ్

ఎటపాక: ప్రతి ఏడాది గోదావరి వరద ముంపునకు గురవుతున్న తమ గ్రామాలను పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఎటపాక మండలం గన్నవరం,కృష్ణవరం పంచాయతీల ప్రజలు ఆదివారం గ్రామాన్ని చుట్టుముట్టిన గోదావరి వరదలో జలదీక్ష నిర్వహించారు. భద్రాచలం వద్ద గోదావరి వరద 50 అడుగులకు చేరగానే గ్రామాలను వరద నీరు చుట్టుముడుతోందని వాపోయారు. ప్రతి ఏడాది ఇన్ని ఇబ్బందులు పడుతున్నా గ్రామాలను పోలవరం ముంపు జాబితాలో చేర్చకపోవడం బాధాకరమన్నారు.ఎన్ని మార్లు తమ సమస్యను అధికారులకు విన్నవించినా పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి ఇంటికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి తమ కుటుంబాలకు పునరావాసం కల్పించి ఇక్కడ నుంచి తరలించాలని వేడుకున్నారు. గ్రామాలన్నీ నీటమునుగుతున్నా తమ సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో గన్నవరం సర్పంచ్ భద్రమ్మ,ఉపసర్పంచ్ కుందుకూరి స్వర్ణ,కరి చినశ్రీను,ములిశెట్టి శేఖరం,కరి నర్సింహారావు,ఆకుల దయాకర్ పాల్గొన్నారు.

పాములాయి గెడ్డలో యువకుడి గల్లంతు

హుకుంపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో పాములాయి గెడ్డను దాటేందుకు యత్నించిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో తీగలవలస పంచాయతీ పాములాయి గ్రామం సమీపంలోని గెడ్డ నుంచి ఇసుక తరలించేందుకు డుంబ్రిగుడ మండలం గుంటసీమకు చెందిన పలువురు టిప్పర్‌తో వచ్చారు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గెడ్డలో దిగిన టిప్పర్ మొరాయించింది. మండల కేంద్రం పెదబయలులో గల టిప్పర్ యజమానికి వద్దకు వెళ్లేందుకు గెడ్డ అవతల గల మంగబందకు టిప్పర్ డ్రైవర్ దివాకార్ బయలుదేరాడు. అయితే ఆయనకు తోడుగా గుంటసీమకు చెందిన కిల్లో సోమ్‌నాథ్ (18) కూడా గెడ్డలోంచి ఈదుకుంటూ వెళ్లాడు. వీరు గెడ్డ దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ సోమ్‌నాథ్ కొట్టుకుపోయాడు. గమనించిన అక్కడి కూలీలు వెంటనే గ్రామస్తులకు, సోమ్‌నాథ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు గెడ్డ వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఆ యువకుడి ఆచూకీ లభించలేదు. విషయం తెలుసుకున్న హుకుంపేట ఎస్‌ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసునమోదు చేశారు.

జయవర్ధన్ మృతదేహం లభ్యం

పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగింత

కొయ్యూరు: వారం తరువాత గల్లంతైన రీమెల జయవర్ధన్(22) మృతదేహం ఆదివారం పెదమాకవరం వంతెనకు పర్లాంగు దూరంలో లభ్యమైంది. విజయనగరం నుంచి వచ్చిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందం శనివారం నుంచి గాలింపు చేపట్టాయి. ఆదివారం రామరాజుపాలెం–పెదమాకవరం మధ్య గాలింపు చేస్తుండగా తుప్పల మధ్య చిక్కుకుపోయి పూర్తిగా పాడైన జయవర్ధన్ మృతదేహాన్ని కనుగొన్నారు. మరణించి వారం కావడంతో చాలా వరకు పాడైంది. గుర్తు పట్టలేని విధంగా తయారైంది. అతి కష్టం మీద మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం వెంటనే పోస్టుమార్టంకు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి వారం రోజుల నుంచి మృతదేహం కోసం అనేక ప్రాంతాల వద్ద గాలింపు చర్యలు చేపట్టిన తహసీల్దార్ రాజేశ్వరరావు. సీఐ వెంకటరమణ, ఎస్ఐ రామకృష్ణలను కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ బర్దర్ అభినందించారు. ఎస్‌డీఆర్ఎఫ్ పనితీరుపై కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


జయవర్ధన్ (ఫైల్)


కాలువలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

సాహితీ విశ్వరూపం రావిశాస్త్రి


రావిశాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కథా రచయితలు, సాహితీవేత్తలు

సీతంపేట: రాచకొండ విశ్వనాథ శాస్త్రి సాహితీ విశ్వరూపమని రచయిత, న్యాయవాది వృద్ధుల కల్యాణ రామారావు అన్నారు. ఉదయిని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రాచకొండ విశ్వనాథ శాస్త్రి 102వ జయంతి సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని ఎలా అర్థం చేసుకోవాలో రావిశాస్త్రి సాహిత్యం వల్లనే తెలిసిందన్నారు. రావిశాస్త్రి పరిచయంతో వాస్తవ సమాజం చూశానని, ఆయన రచనలు చదువుతూ ఉంటే ఆత్మీయత కనిపిస్తుందన్నారు. రావిశాస్త్రి రచనల్లో తనకు నచ్చిన జరీ అంచు, విలువలు, మాయ కథ ఆయనకు కూడా బాగా ఇష్టమని పేర్కొన్నారు. రావిశాస్త్రి రచనల్లో చాలా వరకు కోర్టు వాతావరణంతో ముడిపడి ఉంటాయని, క్రిమినల్, పోలీస్, లాయర్, మెజిస్ట్రేట్ అయితే బాగా అర్థమవుతాయన్నారు. కథారచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర మాండలికానికి శాస్త్రి తన రచనలతో విశ్వవ్యాప్త గుర్తింపు తెచ్చారని కొనియాడారు. రావిశాస్త్రి కుమారుడు ఉమాకుమార శాస్త్రి మాట్లాడుతూ తాను న్యాయవాదిని అయ్యాకే తండ్రి రచనల విలువ తెలిసిందన్నారు. రచనల్లో చెప్పినట్టే ఆయన తన జీవితాన్ని నిరాడంబరంగా గడిపారని గుర్తు చేశారు. ప్రముఖ విమర్శకులు వర్మ మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన భావజాలంలోని లోపాలను రావిశాస్త్రి తన రచనల ద్వారా ఎత్తిచూపారని తెలిపారు. సభాధ్యక్షులు కుమార్ కూనపరాజు మాట్లాడుతూ శాస్త్రి రచనలు 60–70 ఏళ్ల మధ్య రాసినవి అయినప్పటికీ నేటి ఆధునిక యుగంలో సాహిత్యానికి దగ్గరగా ఉంటాయన్నారు. ప్రజా కవి దేవిశ్రీ రావిశాస్త్రిపై పాడిన పాట అందరినీ ఆకట్టుకుంది. అనంతరం రావిశాస్త్రి సాహితీ పురస్కారాలను యువ రచయితలు సురేంద్ర శీలం, శ్రీఊహా, మల్లిపురం జగదీష్‌లకు అందజేసి సత్కరించారు.

హేళన తట్టుకోలేక యువతి ఆత్మహత్య

మునగపాక: పుట్టినప్పటి నుంచి గూని ఉండడంతో సమాజంలో తిరిగేటపుడు హేళన చేయడాన్ని తట్టుకోలేక ఒంపోలు పేటకు చెందిన నక్కా మాధురి(19) గడ్డిమందు తాగి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఒంపోలు పేటకు చెందిన నక్కా సత్యనారాయణ కుమార్తె మాధురి చిన్నప్పటి నుంచి గూనితో జీవనం సాగిస్తుంది. ప్రజల మధ్య తిరిగేటపుడు తనను హేళన చేస్తున్నారని దీనిని తట్టుకోలేక శనివారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు మాధురిని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఏఈవో ఆనంద్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

మైనర్ కిడ్నాప్ ఘటనపై కేసు నమోదు

ఎంవీపీకాలనీ: పెదవాల్తేర్‌కు చెందిన మైనర్‌ను కిడ్నాప్ చేసిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన శోభనాపురపు యువరాజు నగరంలోని సుజాతనగర్‌లో ఓ టైల్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. పెదవాల్తేర్‌కు చెందిన ఓ మైనర్‌తో సోషల్ మీడియాలో పరిచయం ఏర్పడింది. దీంతో ప్రేమ పేరుతో ఆ బాలికను యువరాజు వలలో వేసుకున్నాడు. అతని మాటలు నమ్మిన మైనర్ ఇటీవల బయటకు వెళ్లివస్తానని తల్లిదండ్రులకు చెప్పి ప్రేమించిన యువకుడితో వెళ్లిపోయింది. ఈ విషయం తెలియని తల్లిదండ్రులు బాలిక కోసం విస్తృతంగా గాలించగా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం వారు ఎంవీపీ పోలీసులను ఆశ్రయించారు. వారి విచారణలో యువరాజు ఆ బాలికను తీసుకుపోయినట్లు తెలిసింది. దీంతో యువరాజుపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నం పెట్టే అమ్మ..అర్ధంతరంగా..

- బైకుపై నుంచి జారిపడి మహిళ మృతి
- పేద కుటుంబంలో తీరని వేదన


మృతురాలు రత్నం(ఫైల్)

కోటవురట్ల: పేదరికం వెంటాడుతుంటే కూలి కష్టంతో కుటుంబాన్ని పోషిస్తున్న ఓ మహిళ ప్రమాదంలో మృతి చెందింది. అపరిచితుడి బైకు ఎక్కి ప్రమాదవశాత్తూ జారిపడి తిరిగిరాని లోకాలకు పోయింది. ఇద్దరు పిల్లలు తల్లిలేని బిడ్డలయ్యారు. అమాయకపు భర్త అయోమయంగా చూస్తుంటే అందరి హృదయాలను కలిచివేసింది. కొడవటిపూడి గ్రామానికి చెందిన తేటకాల రత్నం(36) ఆదివారం ఉదయం గ్రామ శివారున ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీకి వెళ్లి మృత్యువాత పడింది. గ్రామంలోని స్టేట్ బ్యాంకు వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తి బైకు ఎక్కిన రత్నం ఫ్యాక్టరీ వద్ద రోడ్డుపై విగతజీవిగా కనిపించింది. గ్రామస్తుల కథనం మేరకు రత్నం భర్త అప్పారావు అమాయకుడు కావడంతో రత్నమే జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేసి కుటుంబాన్ని పోషించేది. జీడిపిక్కల ఫ్యాక్టరీ కొద్ది రోజుల క్రితం మూతపడడంతో పనిచేసిన కాలానికి పింఛను ఎంత వస్తుందో తెలుసుకునేందుకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. కె.వెంకటాపురం వైపుగా వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి బైకు ఎక్కగా ఫ్యాక్టరీ దాటుతుండగా ఫ్యాక్టరీ దాటేస్తున్నామన్న కంగారులో బైకుపై నుంచి కిందికి దూకి ఉంటుందని అనుమానిస్తున్నారు. లేదంటే బైకు సడన్ బ్రేక్ వేయడంతో రోడ్డుపై జారిపడిన రత్నం తలకు బలమైన గాయం కావడంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. భయపడిన బైకువాలా అక్కడి నుంచి పరారైనట్టుగా ఊహిస్తున్నారు. రోడ్డుపై పడిఉన్న రత్నాన్ని చూసిన స్థానిక రైతులు వెంటనే ఆమె వద్దకు వెళ్లి చూడగా ప్రాణాలు కోల్పోయినట్టుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

ఆ ప్రాంతం కుటుంబసభ్యుల రోధనతో బరువెక్కింది. భర్త అప్పారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటవురట్ల సీహెచ్‌సీకి తరలించారు. సర్పంచ్ కోసూరు అప్పారావు, ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్ బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉండగా పేదరికంగా కారణంగా కుమార్తె పదోతరగతి వరకు చదివి మానేసింది. కుమారుడు 8వ తరగతి చదువుతున్నాడు. తల్లి మరణంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు.


మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు